# సన్మాన సంఘం వస్తోంది




ఎన్జీఓల సమ్మె పుణ్యమా అని పొద్దున్న ఎనిమిదయినా ఇంకా ముసుగు తన్ని పడుకునే ఉన్నాను. హఠాత్తుగా తలుపు దడదడ కొట్టిన చప్పుడు వినిపించేసరికి నాకు వళ్లు మండిపోయింది. చేయక చేయక మేము సమ్మె చేస్తున్నప్పుడు కూడా మమ్మల్ని ప్రశాంతంగా ఇంటి దగ్గర గడపనీకుండా ఏమిటి గొడవ అని విసుక్కుంటూ వెళ్ళి తలుపు తెరచాను. ఎదురుగ్గా మామూలుగానే శాయిరామ్, రంగారెడ్డి, గోపాల్రావ్, యాదగిరి, చంద్రకాంత్ ఛటోపాధ్యాయ్, రాజేశ్వరీ, పార్వతీదేవి, జనార్ధన్– అంతా నిలబడి ఉన్నారు.

“ఏమిటి?” అడిగాను కోపం అణచుకుంటూ.

“పదగురూ– ఎమర్జెన్సీ మీటింగ్ పెట్టాం–” అన్నాడు యాదగిరి.

“ఎందుకు?”

“జనార్దనన్నకు సన్మానం చేస్తున్రు మన కాలనీ వాళ్లు–”

నేను ఉలిక్కిపడ్డాను– “జనార్దన్‌కి సన్మానమా?”

“అవును” అన్నాడు రంగారెడ్డి చిరునవ్వుతో “పాపం– ఎంత కాలమని వాడినలా వదిలేస్తాం? అడ్డమైనాడూ సన్మానాలు చేయించుకుంటూంటే – పదహారు సినిమాల్లో

హీరోగా నటించిన మనాడికి ఎందుకు చేయకూడదు? మన కాలనీలో ఉంటున్నాడనేగా మనకింత లోకువ?”

ఆ మాటకు జనార్థన్ కొంచెం సిగ్గుపడ్డట్లు నటించాడు.

“పదహారు సినిమాలెక్కడున్నాయ్?” మరింత ఆశ్చర్యంగా అడిగాను.

“అదే అన్నా – పదిహేను సినిమాలు మధ్యలో ఆగిపోయాయ్– ఎప్పటికయినా గాని రిలీజవుతాయ్‌లే–” అన్నాడు యాదగిరి.

“ఆ రిలీజయిన ఒక్క సినిమా కూడా ఒకే ఒక్కరోజు మాణింగ్ షో ఆడింది” కసిగా అన్నాడతను. జనార్ధన్‌కి కోపం ముంచుకొచ్చింది.

“ఎవరన్నా రా మాటా? రెండోరోజు కూడా ఆడింది– ఒంగోలులో” ఛప్పున శాయిరామ్ కల్పించుకున్నాడు.

“ఇప్పుడా స్టాటిస్టిక్స్ ఎందుకులే గురూ! ముందు ఎమర్జెన్సీ మీటింగ్‌కి పద–” అన్నాడు నాతో. ఇంక గత్యంతరం లేక వాళ్ళ వెంబడి బయలుదేరాను.

కాసేపు తర్జన భర్జనలు తర్వాత జనార్ధన్‌కి సన్మానం చేయటానికీ, ఆ సన్మాన సభలో అతగాడికి ఓ బిరుదు తగలించటానికి నిర్ణయం జరిగిపోయింది.

“ఏం బిరుదు ఇద్దాం?” అడిగాడు రంగారెడ్డి.

“నట సామ్రాట్ జనార్దన్–” అన్నాడు శాయిరామ్.

“ఛట్– అది అక్కినేని కిచ్చేశారయ్యా– అన్నాడు గోపాల్రావ్.

“పోనీ నటశేఖర– ఉత్సాహంగా అన్నాడు చంద్రకాంత్.

“అది కృష్ణకిచ్చేశారు–”

“నట సార్వభౌమ–”

“అది ఎన్టీ ఆర్ ది–”

“డాషింగ్ హీరో పెడదాం–” అంది రాజేశ్వరి.

అందరూ నవ్వారు. “అదీ కృష్ణదే!” అన్నాడు యాదగిరి.

“ఆ! డేరింగ్ హీరో– డేరింగ్ హీరో” అంది పార్వతీదేవి.

“అది చిరంజీవిది.”

“మరింకేం మిగిలేడ్చాయని మనాడికి? అన్నీ వాళ్ళే తీసేసుకున్నారు–” చిరాకుగా అన్నాడు రంగారెడ్డి.

“బిరుదు సంగతి సరేగానీ అసలు మనకు ఈ సన్మానాలెలా చేయాలో అనుభవం లేదు కదా– ఎలా” తన అనుమానం వెలిబుచ్చాడు శాయిరామ్.

‘అవునవును! మన కాలనీలో ఎప్పుడూ ఎవరికీ మనం సన్మానం చేయలేదు– జరుగగా చూళ్ళేదు– అన్నాన్నేను.

అందరం ఆలోచనలో పడ్డాం కొద్ది క్షణాలు.

"పోనీ ఓ పని చేద్దాం–" అన్నాడు శ్యామ్రావ్ మెల్లగా మా గుంపులో జొరబడుతూ.

"ఏమిటది?" చిరాగ్గానే అడిగాను.

"చిక్కడపల్లిలో ఓ కల్చురల్ ఆర్గనైజేషన్ ఉంది. వాళ్ళా మధ్య మా ఫ్రెండ్ ఒకతనికి– వదలకుండా 48 గంటలు మందుకొట్టినందుకు సన్మానం చేశారు. అది ప్రపంచ రికార్డ్ ఆట. వాళ్ళ నడిగితే వాళ్లే ఆ ఏర్పాట్లన్నీ చేసేస్తారేమో–

మాకూ ఆ అయిడియా బాగానే ఉందనిపించింది. అయితే శ్యామ్రావ్ లాంటి వాడి మాటలు నమ్మవచ్చా అని లోలోలపల అనుమానంగా ఉన్నా – అప్పటికప్పుడే అందరం కలసి మూడు ఆటోల్లో చిక్కడపల్లి చేరుకున్నాం.

మురళీకృష్ణా కల్చురల్ అసోసియేషన్ అన్న బోర్డు వేలాడుతోంది బయట! మమ్మల్నందరినీ సాదరంగా లోపలకు ఆహ్వానించాడు దాని ఓనరు కుటుంబరావ్.

"మీ కాలనీ గురించీ, మీ గురించీ న్యూస్‌పేపర్స్‌లో చూస్తూనే ఉంటానండీ! ఎన్నోసార్లనుకున్నాను– మీ కమిటీ మెంబర్లందరికీ సామూహిక సన్మానం చేయాలని– ఆ విషయం గురించి మాట్లాడ్డానికి నేనే మీ కాలనీకి రావాలనుకుంటున్నాను" అన్నాడు ఆనందంగా. ఆ మాట వింటూనే శాయిరామ్ సంతోషంతో పొంగిపోయాడు.

"మీ ఇష్టం మీరంతగా కాదూ కూడదంటే– సరే– అలాగే కానీండి" అన్నాడు కొంచెంగా మెలికలు తిరుగుతూ. ఇదేదో కొంపల మీదకు రాబోతూందని పసిగట్టి వెంటనే సంభాషణను డైవర్ట్ చేసేశాను.

"ఆ సంగతి సరే గానండీ– ప్రస్తుతం మేమో ముఖ్యమయిన పనిమీద వచ్చాం!" అన్నానతన్తో.

"ఏమిటండీ అది?" కుతూహలంగా అడిగాడతను.

"మా జనార్ధన్ మీకు తెలుసు కదా– చాలా పెద్ద సినీహీరో–" అడిగాను.

"అయ్యో – తెలీక పోవటమేమిటండీ! మా వాళ్ళందరికీ అభిమానం అతనంటే. అతని సినిమా మేమంతా రెండుస్లార్లు చూశాం–" అతనిమాట అబద్ధం అని మాకు ఠక్కున తెలిసిపోయింది. అది ఒక్క షోయే కదా ఆడింది.

"అందులో నేను వేశాను" అన్నాడు యాదగిరి ఉత్సాహంగా.

"అవునవును– మీరు కూడా చాలా అద్భుతంగా నటించారు– మీ ఇద్దరివీ ఆటోగ్రాఫ్‌లు తీసుకోవాలని ఎప్పటి నుంచో ప్రయత్నం–" అంటూ జేబులోనుంచి ఆటోగ్రాఫ్ పుస్తకం తీసి అప్పటికప్పుడే వాళ్ళిద్దరి ఆటోగ్రాప్‌లూ తీసుకున్నాడు.

"సంగతేమిటంటే– మా జనార్ధన్‌కి సన్మానం చేయాలని మా కాలనీ వాళ్ళందరికీ కోరిక కలిగింది. అందుకు మీ సహాయం అడుగుదామని–"

కుటుంబరావ్ మొఖం ఆనందంతో వెలిగిపోయింది.

"అయ్యో! మీరు అడగాలా! అది మా డ్యూటీ బాబూ! ఎక్కడ గొప్పతనం, టాలెంటూ ఉంటాయో అక్కడ సన్మానాలు చేయటం మా బాధ్యత- అంతే! మీ రెళ్ళి పోండిక! ఎల్లుండి సాయంత్రమే సన్మానం! సరేనా?"

"మరి మేము ఏమేం ఏర్పాట్లు చేయాలో చెప్తే-..." నసిగాడు శాయిరామ్.

"అదంతా నాకొదిలేయండి- మీరు స్టేజీ, షామియానాలు ఏర్పాటు చేసుకుంటే చాలు- మిగతాదంతా మా అసోసియేషన్ చూసుకుటుంది.

అందరం అతని మంచితనానికి, విశాల హృదయానికి ధన్యవాదాలు చెప్పి తిగిరి వచ్చేశాము. ఆ మర్నాటి నుంచే జనార్ధన్‌కి సన్మానసభ ఏర్పాట్లు మొదలయిపోయాయ్.

గోపాల్రావ్ తన "ఈ క్షణం" పేపర్లో ఆ విషయం గురించి ఓ పెద్ద న్యూస్ అయిటమ్ వేసేశాడు.

రెండోరోజు సాయంత్రం అయిదయేసరికి కుటుంబరావ్ కార్లో వచ్చేశాడు కాలనీకి. అందరం అతని చుట్టూ మూగేశాము.

"ఇంకో అరగంటలో మావాళ్ళొచ్చేస్తారు" అన్నాడతను. అప్పటికే వేదిక ముందు మా కాలనీ తాలూకూ పిల్లా పెద్దా ఆడా- మగా అంతా క్రిక్కిరిసిపోయి ఉన్నారు. శాయీరామ్ మైక్ ముందు నిలబడి మామూలుగానే ఆ సన్మానం గురించి సన్మానానికి సంబంధంలేని విషయాలు మాట్లాడుతున్నాడు.

ఈలోగా ఒక వాన్ వచ్చి ఆగింది వేదిక దగ్గర. అందులోనుంచి చాలామంది బిలబిలమంటూ దిగి నిలబడ్డారు. అందులోనుంచి ఓ వ్యక్తి తిన్నగా వేదిక మీదకెళ్ళి శాయీరామ్‌ని పక్కకు తప్పించి మైక్ అందుకున్నాడు.

"సోదరీ సోదరీమణులార! ఈ మహత్తరమయిన సన్మాస సభకు అధ్యక్షత వహించవలసిందిగా శ్రీ కుటుంబరావ్ గారిని కోరుతున్నాను. అలాగే ఈ కాలనీ ప్రముఖులు శ్యామ్రావ్ గారిని వేదిక నలకంరించవలసిందిగా మీ అందరి తరపునా కోరుతున్నాను-"

సభలో కలవరం బయల్దేరింది.

"శ్యామ్రావ్ వేదికెక్కడానికి వీలులేదు-" అని అరచారు కొంతమంది.

ఇదేదో గొడవయేట్లుందని మేము అడ్డుపడి వాళ్ళు గొడవచేయకుండా ఆపాము. కుటుంబరావ్, శ్యామ్రావ్ వేదికెక్కారు. మరుక్షణంలో జనార్ధన్‌ని ఓ సన్నాయి, మద్దెల మ్యూజిక్‌తో మా రంగారెడ్డి తోడుగా తీసుకుని వేదిక మీదకొచ్చాడు. కుటుంబరావ్ అతనికి ఎదురెళ్ళాడు. ఓ పన్నెండేళ్ళ పాప హారతి పళ్ళెంతో సహా వాన్ దిగి పరుగుతో వేదికెక్కి జనార్ధన్‌కి హారతి ఇస్తూ "స్వాగతం" అంటూ పాటపాడింది.

జనార్ధన్‌ని ఓ మూల కుర్చీలో కూర్చోబెట్టారు. వాన్‌లో నుంచి మరో వ్యక్తి దిగి దగ్గరకొచ్చి నిలబడి ఫోటోలు చడామడా తీసేయసాగాడు. వాళ్ళంతా ఎవరో ఇంత పకబ్బందీగా ఎలా ఏర్పాట్లు చేయగలిగారా అని ఆశ్చర్యపోతూ చూస్తున్నాం మేము. పురోహితుడు వచ్చి మంత్రాలు చదువుతూంటే శ్యామల్రావ్ లేచి జనార్ధన్ మీద శాలువా కప్పాడు.

వాడిమెడలో దండలేశాడు కుటుంబరావ్. అందరూ తప్పట్ల వర్షం కురిపించేశారు.

"ఇప్పుడు నగరంలోని వివిధ అభిమాన సంఘాలు తమ ప్రియతమ చలనచిత్ర హీరోని పూలమాలాంకితుడిని చేస్తారు–" అన్నాడు కుటుంబరావ్.

నేను ఆశ్చర్యంగా రంగారెడ్డి వేపు చూశాను.

"మనాడికి అభిమాన సంఘాలు కూడా ఉన్నాయా?"

"నాకూ అదే అర్థం కావటం లేదు– ఒకే ఒక్క అభిమాన సంఘం మన కాలనీలోనే ఉంది– అదీ జనార్ధనే బ్రతిమాలి ఏర్పాటు చేశాడు–"

"జనార్ధన్ ఫిలిమ్ ఫాన్స్ అసోసియేషన్ చికడ్‌పల్లి" అంటూ మైకులో పిలిచాడతను. మా కాలనీ జనం మధ్యలో కూర్చున్న ఓ వ్యక్తి లేచి జనార్ధన్ మెడలో పూలదండలేశాడు.

"జనార్ధన్ ఫాన్స్ అసోసియేషన్ వైజాగ్."

మేమంతా ఉలిక్కిపడ్డాం– వీడికి దండలేయటానికి వాళ్ళు వైజాగ్ నుంచి వచ్చారా? ఓ వ్యక్తి ఫుల్‌సూట్‌లో వేదికమీదకొచ్చి జనార్ధన్ మెడలో దండలేసి వెళ్ళిపోయాడు.

ఈసారి "జనార్ధన్ ఫాన్స్ అసోసియేషన్ చికాగో–" అంటూ చదివాడు కుటుంబరావ్. మేము అదిరిపడ్డాం.

"చికాగోలో వీడికి అభిమాన సంఘమా?" ఆశ్చర్యంగా అడిగాడు గోపాల్రావ్.

మేం చూస్తుండగానే వేదిక పక్కనే నిలబడ్డ నల్లగా తుమ్మ మొద్దులా ఉన్న ఓ గిరిజాలవాడు స్టేజి ఎక్కి జనార్ధన్ మెడలో ఓ పెద్ద దండ వేశాడు. ఆ దండమీద "మేడిన్ చికాగో" అన్న అక్షరాలు కనబడుతున్నాయ్.

"వాడి మొఖం చూస్తుంటే అమెరికాలో ఉంటూన్న కళ ఏ మూలనయినా కనబడుతోందా?" అడిగాడు రంగారెడ్డి. ఈలోగా మరో పేరు వినిపించింది.

"జనార్ధన్ ఫిలిం ఫాన్స్ క్లబ్, హాంకాంగ్–

మరో సూటువాలా వచ్చి జనార్ధన్ మెడలో మరో పూలదండ వేశాడు. మాకు మతిపోతోంది. ఆ తతంగం చూస్తూంటే. అరగంట సేపు దండల కార్యక్రమం జరిగింది.

"ఇప్పుడు ప్రముఖ కవివర్యులు "కాంతిశ్రీ" గారు అభినందన కవితలు వినిపిస్తారు" అన్నాడు కుటుంబరావ్.

ముందు వరుసలో కూర్చున్న ఓ లావుపాటి యువకుడు రెండు కాగితాలు తీసుకుని

స్టేజీ మీదకు చేరుకున్నాడు. అతను మైక్ ముందు నిలబడటంతోనే స్టిల్ ఫోటోగ్రాఫ్‌ర్ ఫోటో తీయబోయాడు.

ఠక్కున తనూ వచ్చి ఫోటోలో పడేట్లు నిలబడ్డాడు శాయిరామ్.

కాంతిశ్రీ తన కవితలు చదవటం ప్రారంభించాడు.

"అన్నా జనార్ధననన్నా!

నువ్ వేశావెన్నో వేషాలు!

నీవు లేనిలోటు తీరదులే!

నువ్ పోయిన 'గాప్ పూడదులే! అంటూ విచారంగా పాడి ఆపాడు. అతనలా గద్గద స్వరంతో పాడుతుంటే మాకు కళ్ళవెంబడి నీళ్ళు తిరిగినయ్. జనార్ధన్ కంగారుగా అతనివేపు చూచాడు.

"ఏమిటండీ– ఆ కవిత్వం– నేను ఉన్నాగా, ఎక్కడికో పోయానంటాడేవిటి?" అడిగాడు కుటుంబరావ్‌ని దీనంగా.

కుటుంబరావ్ కవిని కంగారుగా పక్కకు పిలిచాడు.

"ఏయ్ ఏమిటోయ్ ఆ కవిత్వం– సరిగ్గా చూసి అఘోరించు–"

"సారీ సార్– కాగితానికి మొదటివేపు చదవాల్సింది రెండోవైపు చదివాను–" అన్నాడతను నొచ్చుకుంటూ. పొరబాటు సరిదిద్దుకుంటూ రెండోవేపు చదవసాగాడు.

"అన్నా జనార్ధన్నా!

నీ వేషాలకు మా జోహార్లు

నీ ఫీలింగ్స్‌కి మా హేట్సాఫ్!

నటనే నీ ఊపిరిగా

ఊపిరే నీ నటనగా

వర్ధమాన నటీనటులకు నువ్ చుక్కానివి.

తెలుగు కళామతల్లికి రెండో ఎక్కానివి.

అంతా తప్పట్లు మార్మోగిపోయినయ్.

కవివర్యుడు అందరికీ నమస్కరించి స్టేజి దిగాడు. వెంటనే మళ్ళీ మైకు దగ్గరకొచ్చాడు కుటుంబరావ్.

"ఇప్పుడు ప్రముఖ నటులు జనార్ధన్ గురించి ఆంధ్రుల అభిమాన నవలా రచయిత్రి శాంతిశ్రీ గారు ప్రసంగిస్తారు."

వెంటనే ఒకావిడ ముందు వరుసలో నుంచి చకచక నడిచి వేదికమీద కొచ్చింది.

మేమంతా మొఖమొఖాలు చూచుకున్నాం.

"ఆవిడ ఆంధ్రుల అభిమాన రచయిత్రా? ఆ పేరుతో ఒక్క రచనకూడా ఏ

మాగజైన్‌లోనూ చూశ్ళేదే," అంది రాజేశ్వరి హడావుడిగా మా దగ్గరకొస్తూ.

"అవును! నేనూ చూశ్ళేదు" అన్నాడు రంగారెడ్డి.

"సోదర సోదరీమణులారా! నేడు నిజంగా పర్వదినం! ఎందుకంటే నేడు పర్వదినం కాబట్టి! శ్రీ నాగవర్ధన్ గారికీ రోజు సన్మానం జరగటమంటే" జనార్ధన్ అదిరిపడ్డాడు. కుటుంబరావ్ చప్పున లేచి మైక్ దగ్గరకొచ్చాడు.

"నాగవర్ధన్ కాదమ్మా- జనార్ధన్, జనార్ధన్"

"ఓ సారీ! ప్రముఖ చలనచిత్ర నటులు శ్రీ జనార్ధన్ గారికి సన్మానం జరగటమంటే, తెలుగు ప్రజలు తమని తామే సన్మానించుకోవటమని నా అభిప్రాయం. శ్రీ గోవర్ధన్ గారు నాకు చిన్నప్పటి నుంచీ తెలుసు-"

కుటుంబరావ్ మళ్ళీ మైకు దగ్గరకు పరుగెత్తాడు.

"అయ్యో గోవర్ధన్ కాదు తల్లీ- జనార్ధన్- జనార్ధన్-"

"ఓ- సారీ! సోదర సోదరీమణులారా! శ్రీ జనార్ధన్ గారు నాకు చిన్నప్పటి నుంచీ తెలుసు. పువ్వు పుట్టగానే పరమళిస్తుందని నేను నా నవల "గతి తప్పిన మతి" లో 16వ పేజీలో 14వ లైనులో రాశాను- ఖచ్చితంగా అదే జరిగింది. రామవర్ధన్ గాఈరు అయిదోక్లాసు చదువుతున్నప్పుడు!" జనార్ధన్ అదిరిపడి చూస్తున్నాడామె వేపు. "అబ్బా! రామవర్ధన్ కాదు- జనార్ధన్" అన్నాడు కుటుంబరావు.

"ఆ! సారీ జనార్ధన్ గారు స్కూల్లో ఓ నాటిక వేశారు. నాటిక పేరు "అంతా అబద్ధం"- అందులో ఆయన వేసిన పాత్రకు ప్రథమ బహుమతి ఇచ్చారు. ఆ తరువాత ఆయనిక వెనక్కు తిరిగి చూడలేదు. కాలేజీలో ఇంటర్మీడియెట్ చదువుతున్నప్పుడు కూరగాయల మార్కెట్ శ్రీరామనవమి పందిర్లో ఆయన నటించిన 'విధి వంచితులు" నాటకం- కేవలం ఆయన ప్రతిభవల్లే- పధ్నాలుగు రోజులు వరుసగా ప్రదర్శించాల్సి వచ్చింది."

"అదేమిటి? జనార్ధన్ మన కాలనీ కొచ్చాకేకదా మొదటిసారిగా నాటకం వేస్తున్నా నన్నాడు?" అడిగాడు రంగారెడ్డి.

"అదే అర్థం కావటం లేదు" అన్నాడు శాయిరామ్.

"ప్రతిభను ఎవరూ ఎంతో కాలం అణచలేరు. ఇదే విషయాన్ని నేను "అరచేతి నడ్డుపెట్టి సూర్యకాంతి నాపలేరు" అని నా నవల "వికసించిన హృదయాలు- ముకుళించిన మనుషులు"లో 596వ పేజీలో 18వ లైనులో రాశాను- జనార్ధన్ గారిక్కూడా అచ్చం నేను రాసినట్లే జరిగింది. ఆయన నటనా ప్రతిభను అణచటం సినిమావాళ్ళ వల్ల కాలేదు. ఓరోజు ఆయన నారాయణ్‌గూడాలోని రోడ్డు పక్కన మిరపకాయ బజ్జీలు తింటున్నప్పుడు ఓ ప్రొడ్యూసరు కార్లో వెళ్తూ చూసి వెంటనే తమ సినిమాలో హీరోగా తీసుకున్నారు.

అంతే– ఈ రోజు ఆయన నూటపధ్నాలుగు చిత్రాల్లో నటిస్తున్నారంటే– ఆయనలో ఎంతటి ప్రతిభ ఉందో మీకే అర్థమవుతుంది–"

114 చిత్రాలు అనేసరికి అందరూ ఒక్కసారి ఘొల్లున నవ్వారు కానీ ఆ నవ్వుల్ని ఓవర్‌లుక్ చేస్తూ వెనుకవేపు నిలబడ్డ గుంపు కరతాళ ధ్వనులతో మోతిక్కించేశారు.

"ఆ గుంపులో జనం ఎవరు? మన కాలనీ వాళ్ళల్లాలేరే" అడిగాడు గోపాల్రావ్.

"అవును! వాళ్ళు మనకాలనీ వాళ్ళు కాదు" అన్నాడు యాదగిరి.

"బహుశా మన జనార్ధనంటే మరీ అభిమానం అనుకుంటాను– అయిదు నిమిషాలకోసారి తప్పట్లు కొడుతున్నారు" అన్నాడు రంగారెడ్డి.

"కనుక సోదరీమణులారా! నా ఎనభై తొమ్మిదో నవల "పునరంకితులు" హీరో కూడా అచ్చం మన శ్యామ్‌వర్ధన్ గారిలాగానే సినిమా హీరో అవుతాడు. అతని మేనగోడలు ఉమారాణి అతను తనను ప్రేమిస్తున్న విషయం తెలీక మనోహర్ అనే ఫుట్‌బాల్ ప్లేయర్‌ని ప్రేమిస్తుంది. కానీ మనోహర్ అప్పటికే రజని అనే బాస్కెట్‌బాల్ ప్లేయర్‌ని ప్రేమిస్తాడు–"

కాలనీవాళ్ళు అలవాటు ప్రకారం ఆ తరువాత ఆమెను మాట్లాడనీకుండా కేకలు వేసి దింపేశారు. వెంటనే ఇద్దరు స్త్రీలు భరతనాట్యం దుస్తుల్లో వేదిక మీద కొచ్చారు.

"ఇప్పుడు బేబీ సురేఖ బేబీ విరేఖల అభినందన నృత్యం" అన్నాడు కుంటుంబరావ్. అనడంతోనే వాళ్ళిద్దరు చెంగున గాలిలో కెగిరి దూకి నృత్యం ప్రారంభించేశారు.

"ఒకోళ్ళకూ కనీసం ముప్పయ్ అయిదేళ్ళుంటయి– వీళ్ళు బేబీలా?" వికారంగా మొఖం పెట్టి అడిగాడు శాయిరామ్. అందరం ఘొల్లున నవ్వాం.

"ష్ ష్" అన్నాడు శ్యామల్రావ్ మా వేపు చూసి, జనార్ధన్ చుట్టూ తిరిగి డాన్స్ చేసేస్తున్నారు వాళ్ళు.

జనార్ధన్ బెరుగ్గా చూస్తున్నాడు వాళ్ళవేపు.

వాళ్ళ డాన్స్ కార్యక్రమం కూడా జనం గొడవ మొదలుపెట్టాకే ముగిసింది.

"ఇప్పుడు నగరం యువజన నాయకులు రాజేశ్వర్ గారు జనార్ధన్ విశిష్ఠతను గురించి మాట్లాడతారు. వెంటనే ఓ లావుపాటి వ్యక్తి తెల్లని లాల్చీ పైజామాతో స్టేజి ఎక్కాడు.

"సోదర సోదరీమణులారా! జనార్ధన్ గురించి మీకెరుకలేదు. బచ్‌పన్‌సే మై ఉస్కా దోస్త్‌హు! చాదర్‌ఘాట్ బ్రిడ్జి దగ్గర మేము రోజూ కల్సుకుని ఇరాని హొటల్ల చాయ్ తాగుతుండె! గప్పుడే నేన్చెప్పినా ఆయనకు! "ఇదిగో– చూడు తంబి– నువ్వీడ ఉండకు, మద్రాస్ గిట్టపోతే మంచిగ సినిమా ఛాన్సులుగిట్ట దొరుకుతయ్–" అని! నా మాట మీద భరోస ఉంచి గట్లనే చేసిండు! గిప్పుడే మయింది మళ్ళా? మంచిగ హీరో అయిపోయిండు. గిట్లనే కొంచెం కోషిష్ జేస్తే సూపర్ హీరో అవుతాడు. సూపర్ హీరో

అయితే ఇంకా కాన్దేమున్నది భాయ్! మస్తు పైసలు ! అభిమాన సంఘాలు! ఛీఫ్ మినిష్టరు గూడా కావచ్చు– ఇయాళ్రేపు ఏమున్నది భాయ్? ఏమీలేదు. మనం ఎట్లనుకుంటే అట్ల జరుగుతది! గుడుంబ అమ్మేలోడు మా నారాయణ్! ఆడిగ్గూడా నిన్ననే మన కుటుంబరావ్ సారే సన్మానం జేసిండు! ఎంత మంచి మడిసతను? ఎవళ్ళడిగినా గాని గుడుంబ ఉ దార్కిస్తడు. గంతెందుకు? పాన్ డబ్బ ఈశ్వర్ ఎరుకనా మీకు? ఎమ్మెల్యే ఎట్లయ్యిండు? ఫిలిం ఫాన్స్ క్లబ్ షురూ చేసిండు మొదాలు!...”

అంతా తప్పట్లు కొట్టి దించేశారతనిని.

“ఇప్పుడు జనార్ధన్ గారు తమకు లభించిన అవమానానికి– సారీ అభిమానానికి సమాధానం చెప్తారు–” అన్నాడు కుటుంబరావ్.

జనార్ధన్ లేచి మైక్ దగ్గరకొచ్చాడు.

“సోదర సోదరీమణులారా! నిజానికి నాకు సన్మానాలంటే ఇష్టంలేదు. కానీ మన శాయిరామ్, రంగారెడ్డి, ఉదయార్కర్, గోపాల్రావ్, యాదగిరి, రాజేశ్వరి, పార్వతీదేవి, శ్యామల్రావ్ ఇంకా బోలెడు మంది మరీ బలవంతం చేయటం వల్ల వప్పుకున్నాను–”

అందరూ నవ్వేశారు. ఎందుకంటే సన్మానం చేయించమని జనార్ధనే కాలనీ వాళ్ళందరినీ రెండు నెలలుగా బ్రతిమాలటం అందరికీ అనుభవమే.

“అసలు నేను– ఆ రోజున మద్రాస్‌లో షూటింగ్‌లో ఉన్నాను. అప్పుడు మన కాలనీ సెక్రటరీ శాయిరామ్ గారు ఫోన్ చేసి ఇలా సన్మానం ఏర్పాటు చేశామనీ, తప్పకుండా రావాలనీ అడిగినప్పుడు– నిజానికి నేను రావటానికి వీలులేని పరిస్థితుల్లో ఉన్నా– వెంటనే అంగీకరించాను. ఎందుకంటే నాకు నా అభిమానుల ప్రేమ ముఖ్యం! అందుకే ఆ షూటింగ్ కాన్సిల్ చేసుకుని వచ్చేశాను...”

“ఇంక చాల్లే దిగు” అరిచారు కుర్రాళ్ళు.

శాయిరామ్ వెళ్ళి ఆ కుర్రాళ్ళ మీద విరుచుకుపడ్డాడు.

ఆ తర్వాత నలుగురు పిల్లలు స్టేజిమీద కొచ్చి జనగణమన పాడారు.

కార్యక్రమం ముగిసింది. జనార్ధన్ పూలదండలన్నీ అతని భార్యా పిల్లలూ ఆనందంగా తీసుకెళ్ళారు.

మేమందరం కలిసి కుటుంబరావుని అభినందించాము.

“ఇంత అద్భుతంగా ఏర్పాట్లు చేస్తారనుకోలేదండీ! నిజంగా చాలా పెద్ద ఎత్తున జరిపారు కార్యక్రమం. మీకెంతో ఋణపడి ఉన్నాం మా కాలనీ వాళ్ళం–” అన్నాడు శాయీరామ్.

అతను చిరునవ్వు నవ్వాడు.

“దాన్దేముందిలెండి! అంత టాలెంట్ ఉన్న వాళ్ళకు ఆ మాత్రం “బూస్టప్’ లేపోతే

ఎలా? ఈ దెబ్బతో చూడండి జనార్ధన్ గారికి తెగ ఆఫర్లొస్తాయ్–"

జనార్ధన్ మొఖం ఆనందంతో వెలిగిపోయింది.

"నిజంగా వస్తాయంటారా?" అడిగాడు ఉత్సాహంగా.

"రేపు అన్ని పేపర్లలో న్యూస్ వస్తుంది కదా– అప్పుడు తెలుస్తుంది– మీ తఢాఖా అందరికీ–"

"కానీ ఈ సన్మానం న్యూస్ ఎవరు పబ్లిష్ ఏస్తారు? మా గోపాల్రావ్ ఒక్కడే "ఈక్షణంలో" వేస్తాడు. అతనొక్కడే కదా అసలు సన్మానం చూడ్డానికొచ్చింది?"

అతను మళ్ళీ నవ్వాడు.

"శుద్ధ అమాయకుల్లాగున్నారండీ బాబూ! వాళ్ళు రావాలేమిటి? మనం ఏది రాసిస్తే అదే వేసుకుంటారు. పత్రికల వాళ్ళు చాలామంది మనాళ్ళే ఉన్నారండి బాబూ – అదంతా నేను చూసుకుంటాగా–"

పది నిమిషాల సేపు మాట్లాడాం గానీ వాళ్ళింకా వెళ్ళకుండా అక్కడే నిలబడడం మాకు ఆశ్చర్యం కలిగించింది.

"ఇంక వెళ్ళిరండి పాపం– చాలా రాత్రయింది" అన్నాడు రంగారెడ్డి.

"మరి ఎక్కౌంట్స్ పూర్తిచేస్తే..." చిరునవ్వు చెరగకుండానే అన్నాడతను.

"ఎక్కౌంట్సేమిటి?" ఆశ్చర్యంగా అఇగాడు శాయిరామ్.

"అదే సన్మానం ఛార్జీలు" శాయిరామ్ పగలబడి నవ్వాడు. "భలే జోకేశారు–" కుటుంబరావ్ నవ్వలేదు.

"జోకు కాదు! సన్మానానికి ఛార్జీలు ఇస్తే..." అన్నాడు సీరియస్‌గా

"ఛార్జీలేమిటి?" ఆశ్చర్యంగా అడిగాడు రంగారెడ్డి.

"అలా తెలీనట్లు మాట్లాడితే ఎలా సార్?అవతల ఆలస్యమయిపోతోంది..."

"మీరనేది నాకేం అర్థం కావటం లేదు" అన్నాడు గోపాల్రావ్.

"మీరు అలాగంటే ఎలాగండి? ఛార్జీలు లేకుండా సన్మానం ఎలా వుంటుంది. అందరూ ఇస్తున్నదే కదా! మీకు ప్రత్యేకంగా చెప్తున్నామా ఏమిటి?""

"అంటే ఇప్పుడు మా వాడికి మీరు చేసిన సన్మానానికి డబ్బివ్వాలా?" ఆశ్చర్యం అణచుకుంటూ అడిగాడు చంద్రకాంత్.

"లేకపోతే ఎలాగండీ మరి?"

మేమంతా మొఖాలు చూసుకున్నాం.

"మరీ విషయం ముంగటే చెప్పనుండె" అన్నాడు యాదగిరి.

"అందరికీ తెల్సిన విషయమే– మీకూ తెలుసు గానీ మీరు వేళాకోళా లాడుతున్నారు సార్–"

శ్యామ్రావ్ మధ్యలో కొచ్చాడిప్పుడు.

"నేను ఇంతకుముందు చాలామందికి చేయించాను కదా! వాళ్ళంతా డబ్బులిచ్చారు– మీరేం ఆలోచించనక్కర్లేదు–" అన్నాడు నచ్చజెప్తూ.

"కానీ మరి ముందే ఆ విషయం ఎందుకు చెప్పలేదు?"

"మీరెందుకు అడగలేదు?"

కొద్దిక్షణాలు అందరం నిశ్శబ్దంగా ఉండిపోయాం.

జనార్ధన్ మొఖం పాలిపోయింది.

"సరే– ఎంతివ్వాలి?" అడిగాడతను.

"మొత్తం ఎనిమిదివేల అయిదొందలు–" అన్నాడతను.

అందరం ఉలిక్కిపడ్డాం.

"ఏమిటి? అంతడబ్బా?"

"ఏ క్లాస్ సన్మానం రేటంతేమరి! నేనేం ఎక్కువ చెప్పలేదు– కావాలంటే మీరే రేట్ల టారిఫ్ చూడండి–" అంటూ తన బాగ్‌లో నుంచి ఓ ఫోల్డర్ తీసి ఇచ్చాడు.

నేను తీసుకుని చూశాను

"ఏ" క్లాస్ సన్మానం– ఎనిమిది వేల అయిదొందలు–(ఫుల్‌ట్రూప్)

"బి" క్లాస్ సన్మానం అయిదువేలు– (తక్కువమంది సభ్యులతో)

"సి" క్లాస్ సన్మానం – మూడువేలు– (నలుగురి బృందంతో)

"మాకు "సి" క్లాస్‌దే చేయాల్సింది మరి–" అన్నాడు రంగారెడ్డి.

"మాకేం తెలుస్సార్! జనార్ధన్ గారు నిన్న సాయంత్రం మా ఇంటికొచ్చి 'ఏ' క్లాస్ కావాలని చెప్పారు"

అందరం కోపంగా జనార్ధన్ వేపు తిరిగాము.

"అబ్బే– నేనెప్పుడడిగానలా అని!" ఆశ్చర్యపోతూ అడిగాడు జనార్ధన్.

''భలేవారే సార్– నిన్న సాయంత్రం మాటల్లో సన్మానం ''ఏ'' క్లాస్‌గా ఉండాలి అన్నారా– లేదా!"

జనార్ధన్‌కి కోపం ముంచుకొచ్చింది.

"ఏ క్లాస్‌గా అంటే నా ఉద్దేశం బాగా ఉండాలని! అంతే! మీ రేట్ల గొడవ నాకేం తెలుసు–" ఇదంతా చూస్తున్న యువజన నాయకుడు ముందుకొచ్చి జనార్ధన్ కాలర్ పట్టుకున్నాడు.

"మర్యాదగా మా డబ్బు ఇస్తావా– ఇయ్యవా?"

మేము అదిరిపడ్డాం.

"ఏమిటయ్యా ఇది– చొక్కా వదులు ముందు" అన్నాడు శాయిరామ్.

అతను జనార్ధన్ చొక్కా వదిలేశాడు.

"మర్యాదగా! మా డబ్బు ఇవ్వండి - లేకపోతే మంచిగుండదు-" అన్నాడతను.

జనార్ధన్ మా వేపు చూశాడు.

"గురూ- నేను తరువాత కట్టుకుంటాను ముందు ఎంతోకొంత వీళ్ళకిచ్చి పంపించేయండి-" అన్నాడు గాబరాగా.

నేనూ, రంగారెడ్డీ, శాయీరామ్, గోపాల్రావ్ పక్కకు వెళ్ళి మాలో మేము చర్చించుకున్నాం.

"మన కాలనీ ఫండ్ ఉంది కదా! అందులో నుంచి ఇచ్చేద్దాం! ఎందుకొచ్చిన గొడవ-" అన్నాడు శాయీరామ్.

"మరి మన కాలనీవాళ్ళు ఎందుకిచ్చారని అడిగితే ఏం చెప్తాం?" అడిగాను.

"తర్వాత సంగతి తర్వాత చూసుకుందాంలే" అన్నాడు రంగారెడ్డి.

గోపాల్రావ్ కుటుంబరావ్ దగ్గరకు నడిచాడు.

"ఇదిగో చూడండి కుటుంబరావ్‌గారూ! మరీ ఎనిమిది వేలంటే చాలా ఎక్కువండీ! కొంచెం తగ్గించుకోండి-" అన్నాడు దీనంగా.

"అవునండీ- మరీ అంతేసి ధరలు చెప్తే ఎలా? ఇదొక్కటే కాదు గదా ఇంకా ముందు ముందు బోలెడు సన్మానాలకు మీకు ఆర్డరిస్తాము" అంది రాజేశ్వరి.

"చూడమ్మా ఈ ఎనిమిదివేలూ నాక్కొడికే రాదమ్మా- పాతికమందికి సర్దాలి- ఒక్కొక్కరికీ మూడొందల కంటె ఎక్కువరావు."

"పాతికమందెవరు?" ఆశ్చర్యంగా అడిగాడు శాయిరామ్.

"ఇదిగో సన్నాయి మద్దెల వాళ్ళకు తలో రెండొందలు! పురోహితుడికి రెండొందలు! జనార్ధన్ గారికి హారతి పట్టిన ఈ చిన్నారి పాపలకు తలోవంద! జనార్ధన్ గారి మీద పద్యాలు కట్టి చదివిన కవిగారికి నూటపదహార్లు, ఆయన గురించి వర్ణించి చెప్పిన నవలా రచయిత్రి గారికి రెండొందలు! యువజన నాయకులకు మూడొందలు! భరతనాట్యం చేసిన ఈ బేబీలకు తలో నూటపదహార్లు, తాళం వేసిన వారికి తలో అర్ధ నూటపదహార్లు, జనంలో నుంచి ఆడపా దడపా తప్పట్లు కొట్టిన యువకులకు తలో యాభై, దీనికి అధ్యక్షత వహించినందుకు నాకు వెయ్యి నూటపదహార్లు, అతిథిగా వేదికనలంకరించినందుకు శ్యామ్రావ్ గారికి నూటపదహార్లు ఇవిగాక మా వాన్ డ్రైవర్‌కి వంద, పెట్రోలుకి యాభయ్- స్టిల్ ఫోటోగ్రాఫర్‌కి రెండొందలయాభై-"

"ఇదన్యాయమండీ- ఇవన్నీ మేము ఏర్పాటు చేయమని అడగలేదు" అన్నాడు జనార్ధన్.

కుటుంబరావ్ మాకు మరింత సమీపంగా వచ్చి గొంతు తగ్గించాడు.

"ఇదిగో చూడండి సార్– ఏదో తెలిసిన వారన్న అభిమానం కొద్దీ చెప్తున్నాను. వెంటనే మీరు ఎవరిడబ్బు వాళ్ళకివ్వక పోయారంటే ఆ యువజన నాయకుడికి తిక్కరేగుతుంది. తిక్కరేగుతే ఏం జరుగుతుందో మీకు తెలీదు. ఆ తప్పట్లు కొట్టిన తన గాంగ్‌నంతా మీమీదకు ఉసిగొల్పి కాలనీ అంతా నానారభసా చేయిస్తాడు. వాడసలే ఈ ఏరియాలో చాలా పెద్ద రౌడీ! శంకద్‌దాదా శిష్యుడు."

యువజన నాయకుడు సిగరెట్ వెలిగించుకుని మా దగ్గరకొచ్చి నిలబడ్డాడు.

"ఏమంటున్నారు గురూ– ఇస్తారా ఇవ్వరా వీళ్ళు?" అడిగాడు నిర్లక్ష్యంగా.

"అంత డబ్బు ఎక్కువంటున్నారు"

"ఎవడా బాడకవ్ అనేది– ఒక్కొక్కడినీ ఖతమ్ చేస్తా– నీ యమ్మ– సన్మానాలు కావాలిగానీ డబ్బులు ఖర్చు చెయ్యరు కొడుకులు! ఏయ్– అందరికీ వార్నింగిస్తున్నా– అయిదు నిమిషాల్లో డబ్బు ఇవ్వకపోయారో– కొడకల్లారా చూస్కోండి మళ్ళా–"

అందరం భయంగా మొఖాలు చూసుకున్నాం–

"ఈ సినిమా హీరోగాడిని కట్టేసి తీస్కపోదాం పదన్నా– ఆళ్ళే డబ్బు తీసుకొచ్చి కట్టి ఇడిపించుకుంటారు–" అన్నాడు తప్పట్లు కొట్టిన వాళ్ళల్లో ఒకడు చాకు తీస్తూ.

"రంగారెడ్డీ! ఇక తప్పదనుకుంటాను– డబ్బు ఇచ్చేద్దాం–" అన్నాన్నేను.

శాయిరామ్ పరుగుతో మా ఆఫీస్ గదికెళ్ళి కాలనీ ఫండ్ తాలూకు చెక్‌బుక్ తెచ్చి ఇచ్చాడు. అందరిపేరా చెక్కులు రాసిచ్చేసరికి రాత్రి పన్నెండయింది. అంతా వాన్ ఎక్కేశారు. కుటుంబరావ్ మా దగ్గరకొచ్చాడు మళ్ళీ.

"సారీ గురూజీ! మీ కాలనీ వాళ్ళంటే నాకు మంచి గౌరవం ఉంది. అందుకే మంచిగా నచ్చజెప్పటానికి ట్రై చేశాను. మొన్న వేరేచోట ఇలాగే నకరాలు చేస్తే ఆ సన్మానం చేయించుకున్నోడిని స్టేజీ మీదే తన్నాం– ఆడి మోటార్ సైకిలు, ఇంట్లో టీవీ అన్నీ లాక్కుపోయాం. కనుక– మళ్ళీ ఎప్పుడయినా అవకాశం వస్తే మమ్మల్నే పిలవండి– ముందే మాట్లాడుకునేట్లయితే కొంచెం కన్సెషన్ కూడా ఇస్తాం లెండి! రాఘవా సన్మానం సంఘం అని నారాయణ్‌గూడాలో ఇంకోటుంది. అక్కడికి మాత్రం ఎప్పుడూ వెళ్ళకండి – మొన్న సన్మానం చేయించుకున్నాక డబ్బు ఇచ్చేందుకు పేచీ పెట్టుకున్నారని స్టేజీ మీదే ఆరుగురిని పొడిచి పారేశారు–"

అతను వాన్‌లో కూర్చోగానే వాన్ వెళ్ళిపోయింది.

అందరం ఎవరిళ్ళకు వాళ్ళు బయల్దేరాం.